# ముట్టడి

'యెంత మాటన్నాడీ యెంగిటిరెడ్డి నా బంగారు కొండని' అని యేడుత్తా ఉండాడు యెంకియ్య. ఎన్నడూ తండ్రి కంట తడిపెట్టటం సూసెరగని పెద్దకొడుకు ఊరుకోబెట్టటానికి 'అము వుంటే అంతేలేరా నాయినా' అన్నాడు.

ఆదూరుకోలా, యేడుత్తానే 'యెంతపని చేసేడురా, రెడ్డి, నా బంగారు కొండని' అన్నాడు.

'నువ్విట్టుంటే, మేంవెట్టా? మేం మా పంజేసుకోవాల్నా వొద్దా?'

'నా యేడుపు నేనేడుత్తా, మీ యేడుపు మీరేడుసుకోండి'

ఆళ్ళ నాయిన్ని ఆళ్ళట్టా సూళ్ళేరు.

యెంకియ్య కుందు గూసుని తలబట్టుకొని యేడుత్తానే ఉండాడు.

ఆడసలు యేడిసే మడిసేగాదు. అట్టాటోడు కువిలకువిలి ఏడుత్తున్నాడు.

మొండెం కాడ గూసుని మునుంబెట్టేడు.

పంతిత్తి తెప్పిచ్చేడు. ఆరేవారూ తీసేడు. యేరు జేసిన పుచ్చె, బంగారంమల్లె, పట్టేడు. ముచ్చికల గుంటకాడ నుంచి మూతిదాంకా, లోపలికి తోసుకుంటా, తలతోలు కుట్టేడు. కడవెడు నీళ్ళు పోయిచ్చి తలంతా కడిగేడు. నీళ్ళొడిసిందాంకా తాటాకు బుట్టలో పెట్టేడు. నీరూ నెత్తురూ కలగలిసి కారినాక యెదురు గంపలో ఉంచేడు. పసుపు రాసేడు. కుంకబ్బొట్లు పెట్టేడు. పూలదండేసేడు. 'దేముడా నా సేత యంతపని సేయిత్తన్నావురా?' అని ఆకరేదుపేడిసి, గంపెత్తుకుని, బొందల్లోకి బోయి, గోతిలో పెట్టి, కొమ్ములు ముద్దాడి, కొత్త గుడ్డ కప్పి, మట్టేసి, పూడిసి, దణ్ణంపెట్టి, తిరిగొచ్చేడు యెంకియ్య. యెంటున్న కొడుకులు యనకమ్మట తిరిగొచ్చేరు.

యెంకియ్యకు యనబయ్యేళ్ళు. ఇద్దరు పెళ్ళాలు. పద్దానుమంది పిల్లలు. నలుగురల్లుళ్ళు ఇల్లరికం వచ్చేరు. పదిమంది కోడళ్ళు వచ్చేరు. పతోళ్ళకి యేడెనిమిది మంది పిల్లలు. మనవళ్ళకి లగ్గాలయ్యేయి. మనవరాళ్ళు కాపరాలకెళ్ళేరు. అందరిదీ కనీ పెంచే వొయిసు. యెంకియ్య పెళ్ళాలు దప్ప ఎవరూ పోలేదు. రోగం రొచ్చులేదు. కాయకష్టం, రైతుకూలీలు. కూలీనాలీ జీవనం. రెండొందలోట్లు! పెద్దబలగం!

యెంకియ్య దొడ్లో మాంసం గోత్తన్నారంటే ఈళ్ళకి పండగ. అంతా వొచ్చి, మొండేన్ని ముట్టడించేరు.

మొండెం యెల్లకిల దిప్పి, ముడ్డికాణ్ణుంచి మెడదాంకా సేరు, బొద్దు, యెదురొమ్ములపైన గీత గీసినట్టు గోసేడు పెద్దకొడుకు. గిలకలు దప్పిచ్చి కాళ్ళతో తొలాలిసేడు. కాళ్లేరు కాంగానే సెయ్‌బెట్టి తోల్దోత్తూ మొండెం యేరు జేసేడు.

తోలు యేరవంగానే మొండెం ముడ్డికాణ్ణుంచి గొంతు కోలుదాంకా పొట్ట నిలువునా చీరేడు. పక్కటెముకలు కమలాల్లా ఇచ్చుకున్నై. పొట్టపేగులు తప్పిత్తే జల్లలో యేసుకెళ్ళేరు, కొడుకులు.

నాకు నల్లగావాలాంవటాని గారాంజేతన్న నల్లదాన్ని ముని మనవరాల్ని యెంకియ్య యెత్తుకెలతా 'దీనికి నల్లలేదే నాతల్లి' అంటా తల సవరిచ్చేడు.

ఎప్పుడు గొడ్డుగోసినా నల్ల ఈనల్లదాని అక్కు! అక్కుదప్పి పోతేనే పసిది అల్లాడిపోతావుంది.

ఒక్కొడుకు తోలు పక్కకి లాగి! సలపదీసి జజ్జు జప్పర లాగేసి, కడిగి, ఇదిలిచ్చి, గడ్డిమీదేసి, సున్నం రాసి, తంగేటి చెక్క, కరక్కాయ నలగ్గొట్టి, కలిపి, తోలుకు పట్టిచ్చి, గెల్లగాబులో కంపునీళ్ళు పారబోసి, మంచినీళ్ళు పోసి ఊనటానికి తోలూరేసేడు.

నల్లది ఊరకే ఉంటదా? ఉండదు. నల్ల లేకపోతే, నాలిక, మెదడు కావాలంది. 'అది నాలికలేని పిచ్చిమాలోకం తల్లి! దానికి మెదడు లేదు.' 'నీకు మెదడులేదు' అని నల్లపిల్ల యెగిరి దూకి యెల్లిపోయింది.

పొట్టగోసి పేగులు సుబ్బరంజేసి పెంటపోగులో కుమ్మరిచ్చేరు. పిల్లల సేతులుకి పేగులిత్తే ఆళ్ళు లోపలా బయటా ఆడతా పేడలేకుండా చేసేరు. ఆటిన బొక్కినలో జలపరిచ్చి, గుంజి, కడిగి, పిండి, తాటాకు బుట్టలో పెట్టేరు. ఆటినిండా కొవ్వు.

ఇచ్చురు కడిగి, తుడిచి, పుటకిచ్చురు పుటికలు కత్తితో గీరి, పీతోలు లాగి, గిలకొట్టి కడిగేరు. సిన్నపేగులు, పెద్దపేగులు. ఇచ్చురు, పుటికిచ్చురు తీసుకుపోయిన కోడలు కొండ గోంగూర కాడ లేరిత్తా దూకుతా ఉంది.

దొబ్బకోసం సుట్టుముట్టేరు పిల్లలు. ఉప్పూ కారంవ్ రాసేవోళ్ళు రాసేరు. పుడకలేరేవోళ్ళు యేరేరు. మంటబెట్టేవోళ్ళు పెట్టేరు. కాలిసేవోళ్ళు కాలిసేరు. నోరుగాలా, చేయిగాలా, యేడేడిగా ఊదుకుంటా తింటున్నారాళ్ళు.

ఒద్దిగ్గా సేద్దీసి ఇచ్చేడు. దాన్ని గుడ్డముక్కలో అద్ది. తోలుతిత్తిలో పెట్టి, వారుతో తెచ్చి, ఆరెతీసి, మిగ్గొమ్ములో పొడిసి, మూతికుట్టి వారు పట్టీ కుట్టి, ఆకలేని కదగొట్టు మునిమనవడి మెళ్ళో దండల్లే యాలాడేసేరు. కుండడు కూడూ, సట్టిడు కూరా, ఆడికింక యే మూలకీ సాలవు.

సేరు, వట్టకాయలు యేరుజేసి ముక్కలుగా తరిగి, పెళ్ళికావలసిన మొగపిల్లలున్న ఇంటికి పంపేరు. ఆడిక మొగతనంలో మొనగాడని రాతిమీద రాత.

ఈరిగ, నెరెడు, ఉలవకాయ, కందనగాయ ముక్కలు జేసి, కుండలో యేసి పంపేరు. బాలింతలకు సూలింతలకు ఆ యేపుడు గొప్పమందు.

మొండెం గొంతుకోలు కాణ్ణుంచి, తోకదాంకా యెన్నెంక మజ్జకి బారునా నరుక్కుంటాబోతే మొండెం రొండయింది. మళ్ళీ ఆటిని మజ్జకి నరికితే, నాలుక్కాళ్ళూ యేరయ్యేయి.

మాంసం యెర్రగా లేదు. తెల్లంగా ఉంది. అంతా కొవ్వే! కొవ్వు దీత్తంటే పచ్చులు పచ్చులు బడతావుంది. కొవ్వు జబ్బలు యేరుజేత్తేనే మాంసం. బండెడు కొవ్వు నడుమెత్తు గుట్ట మాంసం మడిసెత్తుకుప్ప. ఎంకెలు సాపంత రాసి.

లప్పల లప్పల కొవ్వున గంపలకెత్తేరు. మూడు గంపలు ఆరుగురు కోడళ్ళు మోయలేక నీలిగి సచ్చేరు. అంత కొవ్వు తిన్లేరు. తింటే ఇరేసినాలు పట్టుకు సంపుతై. మాంసాని కతుక్కున్న కొవ్వే మా మోపుగా ఉంది. ఎంకెల సుట్టూ కొవ్వె! అది మామూలు గోడ్డా? అలవిగానంత మాంసం. అంత కొవ్విన గొడ్డు నాళ్ళు జూళ్ళేదు.

యెంకియ్య కూతుళ్ల నిజానికి ముసిలోళ్ళే! పనిబడితే ఆళ్ళు వొయిసోళ్ళే! పాయపోళ్ళే! ఆళ్ళ దెబ్బకి మొగోళ్ళు జాలరు. ఆళ్ల మాంసం కండలు బుట్టల కెత్తుకెల్లి, సన్నంగా సీలిసి, పగ్గాలతాళ్లకి మల్లే దారాలు దీసి, పసుపు, ఉప్పు, గొడ్డుగారం పులింవి, చెట్టల మజ్జ తాళ్ళు గట్టి, మాంసం దారాలు యాలాడేసి, ఆరబెడతా వుండారు.

కాకులు, మాలకాకులు, బొంతకాకులు, గెద్దలు, పీతురు గెద్దలు, కొంగ గెద్దలు, డొప్ప గెద్దలు, రాబందులు తన్నుకు పోకుండా ముళ్ళకంపలేసి, కాపలా కూసుండారు.

అయ్యి ఎండితే, మద్దుగత్తి దీసుకుని సిన్న సిన్న ముక్కలుగా నరికి, దాపుడు గుండల్లోనో, డబ్బాల్లోనో దాత్తే, యాడాది పొడుగునా వాడొచ్చు. ముసురు బట్టినప్పుడాటి రుసేరుచి. ఈ వరికీళ్ళు కూరొండినా, యేపిచ్చినా, కాలిపిచ్చినా, దేవుడు తోడు, బవురుసి.

నాలుగ్గాళ్ళ మూలి గెంకలు ఇరగ్గొడితే పద్దానుగు యెంకియ్య సంతానానికి, రొండు బాలింతలు, సూలింతలకి. ఒక్క మూలిగెంకె నరికితే దోసెడు ఎంకెలు, గోంగూరలో ఏసి వండితే, సట్టెడు కూర.ఒకెంకె కొడితే గిన్నెడు మూలిగ పడుద్ది. అది తెల్లగా, నల్లగా; నూనెగా, నెయ్యిగా; గుజ్జుగా, గిజురుగా; బరి గొడ్డెన్నెల్లే, గోదారి కలిపిన బువ్వెల్లే, నెయిలో పద్ద బెల్లం వెల్లే, జారిపోతా, నోరూ తియ్యగా, పుల్లగా, యమరంజుగా ఉంటదది. దాని రుసి మరిగినోడు మారాజు కురిసీని గూడా యడంకాలితో ఎగరదన్నేదే! ఇంటిలిపాదీ గిన్నెసుట్టూ జేరి, జుర్రినా, పీల్చినా, తాగినా, నాకినా, నాలిక తెగిపోద్ది. తిన్నగిన్నె కడిగినట్టు లేపోతే ఒట్టు. మూలగెంకలు నమిలితే నూనె గారుద్ది. రుసి నసాళానికంటుద్ది.

రొమ్మెంకల కొవ్వు బెత్తెడెత్తునుంది. బర్రెంకలు కొవ్వుతో మూసుకుపోయేయి. ఏ ఎంకెతీసినా ఏలిడెంత మూలిగుంది.

ఎంకెలు మాంసం పద్దానుగు కుప్పలేసేరు. కుప్పగంప, యే పిల్లోడూ మోయలేడు.

మాంసం తక్కువుంటే ఉమ్మడివంట. ఎక్కువుంటే పోయ్‌లు యేరు. పులుసుగానా, ఇగురుగానా, మసాళాగానా, యేపుడుగానా అదాళ్ళిస్టం నాలిక అదురుస్టం.

కొవ్వు జబ్బలు, లప్పలు, వయ్యలు, పిడికెడంత ముక్కలు గోసి పొడి గుడ్డతో తుడిసింది పెద్ద కోడలు. పొయ్యి ముట్టిచ్చి, గమేళం పెట్టింది. రొండు దోసిళ్ళు అందులో యేసింది. అయ్యి చర చరలాడి, కరిగి, పడవలై, నూనెలో మునిగి పోయేయి. సిల్లులు గరిటెతో దీత్తే ముక్కలు గుప్పెడన్నా లెవ్వు. నూనె డబ్బాలో యేసి, కరుగులు మల్లలో యేసి, ఉప్పూ కారం జల్లి పిల్లలకిత్తే సెయ్‌గాలా, నోరుగాలా, నాలిగ్గాలా, మూతి గాలా, ఉప్పుప్పున ఊదుది, ఎగరేసి, సేతులు మారిసి, కరుగులు దింటంటే, నాసామిరంగా, ఏం రుసిరా నాతండిరి. యఁ వరుసి. ఎప్పుడూ దొరికే రుసిగాదు.

కరుగులైపోయి, మల్లలు పగలనూకి పిలకాయలు పచ్చులెల్లే ఎగిరిపోయేరు వండుతున్న కూర్ల వాసన్లు బీలుత్తా. ఊరంతా ఆళ్ళిళ్ళే!

ఈ టిన్నుల్లో కొవ్వే-నూనే-పేరినా బుడ్డుల్లో, పెమిదల్లో, మూతల్లో యేసి ముట్టిచ్చుటఁ వే! యెంత యెలుగో!

తెల్లారితే సీరాఁవనవమి. తెనాల్లో పోటీలు. ఎడ్లబళ్ళ పందేలు. గిత్తల బండలాగుడు పందేలు. సవారి బళ్ళ పందెంలో వరాపురం, అవర్తలూరోళ్ళదే పైసేయి. రెండెడ్ల బండ లాగుళ్ళో జాగర్ల మూడోళ్ళు, యాటపాలెమోళ్ళు, కొల్లూ రోళ్ళు పోటాపోటీ! గిత్తబండలాగుళ్ళో ఏజిళ్ళోళ్ళు తిరుగులేనోళ్ళు.

ఏజిళ్ళలో సల్లా వోళ్ళు జాతి గిత్తల్ని మేపే మోతుబర్లు. నాలుగేళ్ళ నుంచి గెలుపాళ్ళదే!

సల్లా యెంకిటిరెడ్డి పేరు కోసఁవ్ ఊరమ్మేబాపతు. గెలుపుకోసఁవ్ గొంతు పిసుక్కొనే రకం.

యెంకియ్య తాత ముత్తాతల కాణ్ణుంచి సల్లా వోళ్ళింట్లో జీతంనాతం చేస్తా ఉండారు. యెంకిటిరెడ్డి యెంకియ్యను 'తాతా' అనే పిలిసేవోడు.

అయింట కోడె పుట్టగానే తన మునిమనవడనుకొన్నాడు యెంకియ్య. ప్రేమగా పెంచాడు. 'యారామునీ' అంటే మోరెత్తిచూచేది. అది జాతిగిత్త. పుటక మంచిది. బలం గొప్పది. చూపు దొడ్డది. అట్టాటి వొంటితీరు కుదిరిక, పొందిక, అమరిక అన్ని కోడెలకుండదు. తెలివిలో మెరుపు. రోసంలో పులి. మాటపడదు. అదిలించరాదు. చేయి మీద వేయరాదు.

రేపు బండలాగుళ్ళో ముని గెలవాలి. కలకటేరుకి చేయిచ్చి మీసం తిప్పేది సల్లావోళ్ళ గొప్ప.

ఎల్లప్పుడు జీతగాడు సేవింగ్ షో సిగరెట్టు టిన్ను. మామిడి పిందె అగ్గిపెట్టె చేతబట్టి యంట తిరగాల్సిందే!

రేత్రి పూట యెంగిటిరెడ్డి సీమ్మందు పూటుగా తాగుతాడని జిల్లా కంపు కొడతానే వుంది.

యెంకియ్య మునిని దూడగా జూత్తంటే, యెంకిటి రెడ్డి దాని యెద్దుగా తలుత్తున్నాడు. మేపేది, తాపేదీ మోపు జేసేడు. పందెంలో గెలిస్తీరాలి.

'అది గొప్పకోడే, లేతది గందా, ఈడుకు మించిన బరువు. కస్టం! ఈ యేటి కొద్దు' అని యెంకియ్య అంటే రెడ్డి మండి పడ్డాడు. మేపుడుతో యాడాదిలో గిత్తను యెద్దును జేసేడు. సెయ్యెత్తు గొడ్డు.

ముని తరిబీదులో రాటు దేలింది. ఈ ఏటికి గూడా సల్లావోళ్ళదే గెలుపు అని అందరూ అనుకోసాగారు.

ఈ పొద్దుటేల మునికి సివరి తరిబీదు. రేపు తెనాలిలో పందెం!

బండ లాగుడు సల్లావోళ్ళ ఇంటి కాణ్ణుంచి దేవర సెరువుదాంకా ఉంటది.

మజ్జలో రయిలుగేటు. పక్కనే మయిలు రాయి. దానెనకే మొరం. ముందు తంతి స్తంబం. కింద ఇసిక డొంక. దీంటో బండ లాగితే గెలుపు కాయం. డొంకనానుకుని మాదిగ పల్లె.

ముసలి యెంకియ్య. పసిముని మంచి సావాసగాళ్ళు. పిలిస్తే పలుకుద్ది. ఊం అంటే ఉరుముద్ది. చెయ్యేత్తే గాల్లో లేసుద్ది. నేల్లేదు, నింగే అద్దు.

'ఇయ్యేటికి ముని పోటీకొద్దు' అని యెంకియ్య సెబితే, 'మానం పోంగా బతికేం సచ్చేం' అన్నాడు.

'నువ్ దాగొద్దు. మునికి తాపొద్దు' అంటే 'నీ యేడుపు నువ్వేడు' అని కసురుకున్నాడు. 'సెబితే ఇనేరకం గాదు.'

బండ బొక్కలోని ఇనపకడ్డీకి, అటూ ఇటూ మోకులు గట్టి మెడ పట్టెడకు బిగిచ్చి, పలుపుతో ముట్టెకు లాక్కట్టితే సడలవు. కోడె బోతంటే బండ కుక్క పిల్లల్లే జారొచ్చుద్ది.

పొద్దుటే రెడ్డి తాగేడు. మునికి తాగిచ్చేడు. బండగ్గట్టేడు.

పునిస్త్రీ ఆరతిచ్చింది. గాల్లో దీపం ఆరిపోయింది. యెంకియ్య ఆపమంటే 'యేందా పేది' అని అనరాని మాట అనేశాడు. యెంకియ్య గుండె కలుక్కుమంది. ముని కోపంగా కదిలింది.

చుట్టూ మూగిన జనం అదాటుగా ఎగిరి యెనక్కి బోయేరు.

ఆ దూకుడు ఏనాడూ లేదు. ముని కోపపూపు సూత్తే యెంకియ్య గుండె పగిలింది. రెడ్డికి యగసోస, దిగసోసగా ఉంది. కుశాలే కుశాల! పట్ట పగ్గాల్లేవు.

ముని ఊపిరిదీత్తా రయిలుకట్ట కాడాగినట్లయితే, మళ్ళీ అనరాని మాటని, సెయ్యెయ్యటం వే గాదు, సడుగుమీద సరిపేడు. అంతటితో ఆగలేదు. చర్నాకోల దీసేడు.

'యేందా కూతలు? యేందాపని?' అని యెంకియ్య చర్నాకోల లాక్కున్నాడు.

మునికి రోసం పొడుసుకొచ్చింది. ఒక్క దూకు దూకింది. బండమీద నిలబడ్డ రెడ్డి కింద బడ్డాడు. ఎద్దు ఆకాశంలోకి లేసింది. బండ పొర్లింది. దొర్లింది. నిలకడ దప్పింది. ఊపు ఆగలేదు. ఎవరూ ఆపలేరు. మొరం రాయి కాలికి దగిలింది. తంతి స్తంబానికి బండ దగిలింది. ముట్టె మయిలు రాయిగ్గొట్టు కుంది. ఒక్కూపున కూలబడింది. ఎగురుతున్న బండ గాల్లోలేసి పుర్రెమీద పడింది. పుచ్చపగిలింది. ఎద్దులేచింది. దేవర పెరువుదాకా పరుగెత్తింది. బండ చెండులా ఎగిరెగిరి పడింది. రావలసిన చోటుకొచ్చింది. కూలబడింది. పుర్రె పుచ్చగాయకు మల్లే మజ్జకి బగిలింది. నెత్తురు కారుతూ ఉంది. మళ్ళీ లేవలేదు.

'మునీ, తండిరీ, నాయినా, బిడ్డా' అంటూ ఆవురు మన్నాడు యెంకియ్య. 'రెడ్డీ, యెంత పంజేసేవురెడ్డి. ఇంక గెలవ్. ఆక్కుండా గెలవ్. నువ్వే బతుకు! తుతెల్లు!' ఏడుస్తూనే ఉన్నాడు.

ఏడుత్తా ఇసికలో పడి దొర్లుతున్నాడు రెడ్డి. బట్టనలగని రెడ్డి ఏడుత్తుంటే ఎవరూ సూళ్ళేకపోయేరు.

మాదిగపల్లె మొత్తం పోగయింది. యెంకియ్య కొడుకు లందరూ వచ్చేరు.

ఎద్దు తన్నుకులాడతా ఉంది.

'దాన్ని గట్టుకుపొండి' అని రెడ్డి ఒంటరిగా, ఎవరూ తోడు లేకుండా దీనంగా, ఏడుపుకు మల్లే ఊళ్ళో కెళతా ఉండాడు.

యెంకియ్య కొడుకులు ఎద్దుమీద చెయ్యేస్తే అది అంతెత్తులేసి కూలబడింది.

రెడ్డి చెయ్యగూడని పన్లు, మునిమీద సెయ్యెయ్యటం, సడుగుమీద సరసటం, సెర్నాకోల పైకెత్తటం.

యెంకియ్య ఏడుత్తానే గుర్తు జేసుకొంటా 'నా బంగారు కొండ' అంటానే ఉండాడు.

రెడ్డి అనరాని మాట

'నిన్ను మాదిగోడు గోసుకుతినా' శపిచ్చేడు రెడ్డి.

మాదిగోళ్ళు దాన్ని కోసుకుతిన్నారు.

ఆరోజు నుంచి సల్లావోళ్ళ ఇంటి మాదిగ యెంకియ్య కూడు ముట్టలేదు. నీరు తాగలేదు. ఎవురు పిలిసినా పలకలేదు.